ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 27
జూలై 2025





# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేస్తుంది

## ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో గెలిచి క్లీన్ స్వీప్ చేయబోతుందని ప్రభుత్వంలో విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేసిన. శనివారం యాదగిరిగుట్ట మండలం రాళ్లజనగాం, జంగంపల్లి, దాతరుపల్లి, సైదాపురము, మల్లాపురం, మాసాయిపేట, గౌరాయపల్లి, సాదువెల్లి, కాచారం గ్రామాలలో రూ.2.12 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాల పట్ల ప్రజల నుండి ఊహించని స్పందన వస్తోందని తెలిపారు. రాజకీయ పార్టీలు, కులాలు, మతాలతో సంబంధం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఆయా పార్టీల కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు మంజూరు చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలతో సంబంధం లేకుండా నిజమైన అర్హులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేస్తోందని స్వయంగా ప్రజలే చెప్తున్నారని చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారని, మళ్లీ తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే మళ్లీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని ప్రజలు చెప్తుంటే చాలా ఆనందం కలుగుతోందన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి పేదలను దగా చేసిందని మండిపడ్డారు. ఇక ఆలేరు నియోజకవర్గం గత పదేళ్ల నుండి అభివృద్ధికి నోచుకోలేదని, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత తన సొంత ఆస్తులు పెంచుకున్నారే తప్ప ప్రజల బాగోగులను పట్టించుకోలేదన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ కు సాధ్యం కానిది కేవలం 18 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసి నిరూపించిందని పేర్కొన్నారు. గత పాలకులు గందమల్ల రిజర్వాయర్ ను విస్మరిస్తే.. కాంగ్రెస్ పార్టీ ఒక్క ఇల్లు కూల్చకుండా.. రూ.600 కోట్లతో గందమల్ల రిజర్వాయర్ నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రజల్లో తిరుగుతుంటే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజల నుండి వస్తున్న విశేషమైన స్పందన చూస్తుంటే.. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా క్లీన్ స్వీప్ చేస్తుందనే నమ్మకం కలుగుతోందన్నారు. ప్రజల ఆశీస్సులతో ఆలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బీర్ల శంకర్, జిల్లా నాయకుడు దుంబాల వెంకట్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ భరత్ గౌడ్, మండల నాయకుడు శిఖ ఉపేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్ యాదవ్, టౌన్ అధ్యక్షుడు బిక్షపతి, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# కన్న బిడ్డలు భారమైతే ప్రభుత్వానికి అప్పగించండి

## ముళ్ల పొదల్లో, రోడ్డు పక్కన చెత్తకుండీల వద్ద వదిలేయకండి

## తల్లిదండ్రుల పేర్లు రహస్యంగా ఉంచబడతాయి

## మానవత్వంతో వ్యవహరించండి

## జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ దంపతులు



జనగామ జిల్లా 26: (రోమింగ్ న్యూస్) కామంతో కళ్ళు మూసుకుపోయి అక్రమ సంబంధాల వల్ల కొందరు, ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటామని వంచించడంతో మరికొందరు, పేదరికంతో ఇంకొందరు, మళ్లీ ఆడపిల్ల జన్మించిందని మహా తల్లులు కొందరు ఇలా అనేక కారణాల వల్ల అప్పుడే జన్మించిన పసికందులను మానవత్వం మరిచిపోయి రోడ్డు పక్కన ముళ్లపపొదల వద్ద, చెత్త కుండీల వద్ద, వదిలి వెళుతున్న సంఘటనలు మనం అక్కడక్కడ చూస్తుంటాం. ఇంకొందరు అయితే ఏకంగా శిశువులను హత్య చేయడం కూడా అక్కడక్కడ చూస్తుంటాం. ఇదే కోవలో ఇటీవల జనగామ జిల్లా రఘునాథ్పల్లి మండలం ఖిల్లా షాపూర్ గ్రామంలో పది రోజుల క్రితం రోడ్డు పక్కన ఒక మగ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లడం ఆ తర్వాత గ్రామ-స్తులు చేరదీసి సంబంధిత అధికారులకు అందజేయడం జరిగింది. ఆ శిశువు ప్రస్తుతం జనగామ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల పర్యవేక్షణలో హాఇగా, క్షేమంగా ఉంది. రోడ్డుపై శిశువును వదిలి వెళ్ళిన రోజే విషయం తెలుసుకున్న జనగామ జిల్లా కలెక్టర్ అధికారులను పురమాయించి శిశువు యోగక్షేమాలు దగ్గరుండి చూసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం రాత్రి జనగామ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న శిశువును చూడడానికి ప్రత్యేకంగా కలెక్టర్ దంపతులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని పరిశీలించారు. ఒక బిడ్డకు తల్లి అయిన కలెక్టర్ సతీమణి డాక్టర్ సయ్యద్ అమ్రిన్ తల్లి తండ్రి పాలన లేని శిశువు పరిస్థితి ఎలా ఉంటుందో గమనించి ఆ శిశువును అక్కున చేర్చుకొని ప్రేమతో లాలించడం చేశారు. భావోద్వేగానికి గురైన కలెక్టర్ దంపతులు ఈ సందర్భంగా మాట్లాడుతూ కన్న బిడ్డలు భారమైతే ప్రభుత్వ అధికారులకు అప్పగించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండే ఉయ్యాలలో వదలి వెళ్లాలని అంతేకానీ ఎక్కడ పడితే అక్కడ వదిలేయొద్దు అని, అవసరం లేకపోతే ఊయలలో ఉంచండి శిశువులను అధికారులు అక్కున చేర్చుకుంటారు అని అన్నారు. ప్రతీ జీవి కి జీవించే హక్కు ఉంటుందని, మానవత్వం తో వ్యవహారించాలని హితవు పలికారు ఎంతో ముద్దుగా ఉన్న ఆ బిడ్డ ను చూసి.. ఓ పక్క సంతోషం తో.. మరో పక్క బాధతోనే... కలెక్టర్ సతీమణి బిడ్డ కు తానే స్వయంగా అమ్మ గా పాలు తాపించింది.బిడ్డలు దేవుడు ఇచ్చే వరమని.. అలాంటి బిడ్డలను అనాథ గా వదిలి వెళ్లిపోవడం చాలా బాధాకరమన్నారు అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి, చికిత్సపరమైన వివరాలను డాక్టర్లు, వైద్య సిబ్బందితో కలెక్టర్ దంపతులు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉయాల' (Baby Cradle Point)ను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ....పిల్లలను రహస్యంగా వదిలే అవసరం ఉంటే 'ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండే ఉయాల'లో వదిలి వెళ్లాలని... వారి వివరాలను రహస్యంగా పెట్టడం జరుగుతుందని... అంతేగాని ఎక్కడ పడితే అక్కడ పసి బిడ్డలను వదలడం సమంజసం కాదన్నారు. ప్రతి జీవికి జీవించే హక్కు ఉంటుందని... పిల్లలు అవసరం లేని వాళ్ళు.. నవజాత శిశువులని ఊయలలో వదిలేయలని అధికారులు అక్కున చేర్చుకొని.. ప్రభుత్వం వారికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందన్నారు అలాగే, ఎవరికైనా పిల్లల్ని అప్పగించాల్సిన పరిస్థితి ఉంటే, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (DCPU)ని సంప్రదించవచ్చని , చైల్డ్ హెల్ప్లైన్ 1098 లేదా www.cara.wcd.gov.in ద్వారా చట్టబద్ధమైన దత్తత ప్రక్రియను అనుసరించవచ్చని తెలిపారు. పిల్లలను అనధికారికంగా దత్తత ఇవ్వడం/తీసుకోవడం జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) చట్టం - 2015 ప్రకారం నేరమని..ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై గరిష్టంగా 3 సంవత్సరాల జైలుశిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమాన విధించవచ్చన్నారు ఈ కార్యక్రమం లో డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ డి. ఫ్లోరెన్స్, డా. యశ్వంత్ పెడియాట్రిషన్, నీలిమ నర్సింగ్ ఆఫీసర్ (MCH), డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (DCPO) రవికాంత్, చైల్డ్ హెల్ప్లైన్ ( 1098) ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవికుమార్, MCH ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 4 నుండి యాదగిరిగుట్టలో పవిత్రోత్సవాలు

## ఆగస్ట 4 నుండి 6 వరకు పవిత్రోత్సవాల సందర్భంగా ఆర్జిత సేవలు బంద్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆగస్టు 4 నుండి 6 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 4 నుండి 6 వరకు.. మూడు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాల సందర్భంగా.. ఆగస్టు 4 నుండి 5 వరకు రెండు రోజులు స్వామివారి ఆర్జిత సేవలు, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, లక్షపుష్పార్చన పూజలను తాత్కాలికంగా రద్దు చేయనున్నట్లు వెల్లడించారు. పవిత్రోత్సవాలు ముగిసిన అనంతరం.. ఆగస్టు 7 నుండి ఆర్జిత సేవలు తిరిగి పునరుద్ధరింపబడతాయని పేర్కొన్నారు.

# జవహర్ కుటుంబాన్ని పరామర్శించిన బూర నర్సయ్య గౌడ్





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట పట్టణంలో మృతి ఇటీవల మృతి చెందిన బిజెపి అధిరోట పట్టణ ఉపాధ్యక్షుడు గౌలికార్ జవహర్ కుటుంబాన్ని భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు, బిజెపి జాతీయ నాయకులు డాక్టర్ బూర నరసయ్య గౌడ్ శనివారం సాయంత్రం పరామర్శించారు. జవహర్ లాల్ భార్య లత, కుమారులు రామ్ శివాజీ, అర్జున్, విక్రమ్, ఇతర కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. జవహర్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పట్టణ నాయకులు, బిజెపి పట్టణ నాయకులతోపాటు గౌలికార్ కుటుంబ సభ్యులు గౌలికార్ కరణ్ లాల్, గౌలికార్ శ్యామ్ లాల్, గౌలీకార్ భాను, గౌలికార శ్రీనివాస్ ఇతర గౌలికార్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

# వరంగల్ రైల్వేస్టేషన్లో గర్భిణీ స్త్రీ అవస్థలు

## వెంటనే స్పందించిన రైల్వే పోలీసులు



జనగామ, జులై 27: (రోమింగ్ న్యూస్) శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వరంగల్ రైల్వే స్టేషన్ వెయిటింగ్ రూమ్ లో గర్భిణి స్త్రీ నొప్పులతో అవస్థలు పడుతుండగా వెంటనే స్పందించిన రైల్వే పోలీస్ అధికారుల తీరు ప్రశంసనీయం. రాయచూర్ నుండి అనకాపల్లి వెళ్లాల్సిన ఒక ప్రయాణికురాలు (30) కడుపునొప్పితో అవస్థలు పడుతూ వరంగల్ స్టేషన్లో దిగారు. యాక్చువల్ గా ఆమె అనకాపల్లి వెళుతుంది. గర్భంతో ఉన్న ఆవిడ తన కడుపు నొప్పుల అవస్థల వల్ల రాయచూర్ వెళ్లే రైలు నుండి వరంగల్ రైల్వే స్టేషన్ లో దిగి వెయిటింగ్ రూమ్లో కూర్చుంది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే రైల్వే పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి రైల్వే మహిళా ఉద్యోగిని తోడుగా పంపుతూ ప్రత్యేక వాహనంలో రైల్వే స్టేషన్ సమీపంలో గల సీకేఎం మెటర్నిటీ హాస్పిటల్ కు తరలించారు. ఈ సందర్భంగా రైల్వే పోలీస్ కానిస్టేబుల్ ఎస్. సూరయ్య గారు స్పందిస్తూ గర్భిణీ మహిళకు ధైర్యం చెబుతూ, తన జేబులో నుండి డబ్బులు తీసి అసిస్టెంట్గా వెళుతున్న రైల్వే మహిళా సిబ్బందికి ఇస్తూ దగ్గరుండి గర్భిణిగా అవస్థలు పడుతున్న మహిళలకు తోడుగా ఉండాలని చెప్పడం అభినందనీయం. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ స్షు రయ్య మాట్లాడుతూ గర్భిణికి తోడుగా అవసరమైతే తన భార్యను పంపిస్తానని చెబుతూ ధైర్యాన్ని చెప్పడం దగ్గర ఉండి విషయాలను గమనిస్తున్న 'రోమింగ్ న్యూస్' ప్రతినిధినితో పాటు తోటి ప్రయాణికులను కదిలించింది. ఈ సందర్భంగా రైల్వే ట్రావెలింగ్ టికెట్ ఇన్స్పెక్టరు లు పావని, కె.రాజ్, రైల్వే కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు సహకారం అందించారు.

